అమరుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అమరుల త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ఎల్బీనగర్‌లోని లాల్‌బహదూర్‌శాస్త్రి విగ్రహాన్ని శుద్ధి చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు స్వతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటు రెండు నిమిషాలు మౌనం పాటించి వారికి నివాళులర్పించే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. నేటి యువత ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి తెలుసుకుని ఆచరించాలన్నారు. మన స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన ఎందరో మహనీయులకు వందనాలు చెప్పే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టే అదృష్టం కల్పించిన పార్టీ అధిష్ఠానవర్గానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, జిల్లా కార్యవర్గసభ్యుడు కృష్ణంరాజు, కిరణ్‌కుమార్, రాకేష్‌యాదవ్, నాగరాజు, గట్టు రవి, భోస్లే శ్రీనివాస్, భరత్‌వంశీ, గణేష్ పాల్గొన్నారు.


చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రంగారెడ్డి, శ్రీనివాస్

చింతలకుంట చౌరస్తాలో..

వనస్థలిపురం: ఎందరో అమరవీరుల త్యాగ ఫలితమే భారత స్వాతంత్ర్యం అని, వారికి గుర్తుగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వారికి నివాళ్లు అర్పించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. హర్‌ఘర్ తిరంగ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు నూతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం చింతలకుంటలోని తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామ రంగారెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు భారత చట్టాలను గౌరవించి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఎందరో అమరవీరుల త్యాగ ఫలితమే భారత స్వాతంత్ర్యం అన్నారు. నేటి యువత ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగం గురించి తెలుసుకుని ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, వాసుచౌదరి, నర్సింహారావు, శంకర్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


లాల్‌బహదూర్‌శాస్త్రి విగ్రహాన్ని శుద్ధి చేసి నివాళులు అర్పిస్తున్న సామ రంగారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్ తదితరులు


క్షీరాభిషేకం చేస్తున్న రాంచందర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు

అంబేడ్కర్ విగ్రహానికి, మంద కృష్ణ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

చాదర్‌ఘాట్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును సుప్రీంకోర్టులో సెవన్ బై వన్ మెజార్టీతో సాధించినందుకు హర్షిస్తూ మూసారాంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి, మంద కృష్ణ మాదిగ ఫ్లెక్సీకి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మైలపాక రాంచందర్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం క్షీరాభిషేకం చేశారు. బీజేపీ నాయకుడు బొక్క మధుసూదన్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఏర్పుల విష్ణుమాదిగతో కలిసి ఈమేరకు క్షీరాభిషేకం చేశారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నామని, ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని, నిరాహారదీక్షలు, రాస్తారోకోలు, సైకిల్ యాత్రలు, ఉద్యమాలు చేసిన మాదిగ ఉపకులాలు గర్వించదగ్గ విషయమన్నారు. ఈనెల 13న మంద కృష్ణమాదిగ హైదరాబాద్‌కు విచ్చేస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు ప్రతి బస్తీ, ప్రతి డివిజన్ నుంచి కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బీ.చంద్రయ్య, ఇమ్మడి నాగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందుల వాడకంతో ఆరోగ్యం పదిలం


ఆయూష్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

సంతోష్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఆయూష్ ఆయుర్వేద మందులు వాడినట్లయితే ఎటువంటి జబ్బులను అయినా తగ్గించుకోవచ్చునని చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం చంపాపేట డివిజన్ పరిధిలోని చంపాపేట నవజీవన సంఘంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆస్మాసంజుమ్, రంగారెడ్డి జిల్లా మెడికల్ ఆర్గనైజేషన్ మేనేజర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆయుష్‌ను పెంచే మెడిసిన్ కాబట్టి అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.10,000 ఖర్చు అయ్యే మందులు ఇప్పుడు వెయ్యి రూపాయలు మాత్రమే ఖర్చు అవుతుందని ప్రతి ఒక్కరూ జనరిక్ మెడిసిన్ వాడాలని పిలుపునిచ్చారు. వైద్యశిబిరంలో పాల్గొన్న రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్ట వెంకటేష్, బీజేపీ సీనియర్ నాయకులు సుంకరి రమేష్‌గౌడ్, లింగాల దశరథ్‌గౌడ్, యాదిరెడ్డి, మహిళా సంఘం నాయకురాలు పాశం నాగమణి, షానాజ్‌బేగం, కవిత పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో సీనియర్ వైద్య నిపుణులు

వయోవృద్ధుల వైద్య శిబిరానికి విశేష స్పందన

చాదర్‌ఘాట్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ యునాని డిస్పెన్సరీ ఆధ్వర్యంలో నిర్వహించిన వయోవృద్ధులకు ప్రత్యేక జిరియాటిక్ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయూష్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ అమ్తుల్ హసీబ్ హమైరా పర్యవేక్షణలో జరిగిన వైద్య శిబిరంలో మలక్‌పేట, చంచల్‌గూడ, డబీర్‌పుర, ఉస్మాన్‌పుర, సైదాబాద్, ఆజంపుర, పిల్లిగుడిసెలు తదితర ప్రాంతాలకు చెందిన వయో వృద్ధులు మహిళలు పాల్గొన్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వయో వృద్ధులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయూష్ హైదరాబాద్ ప్రోగ్రాం అధికారి వీ.శ్రవణ్‌కుమార్, ఆయూష్ ఫార్మసిస్ట్ సాజిద్ అహ్మద్, మహ్మద్ ఉమద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కంటాక్స్ కాలనీలో ఉచిత వైద్యశిబిరం


ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్బీనగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్‌లోని ఇన్‌కంటాక్స్‌కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి వైద్యసిబ్బంది ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందజేశారు. శనివారం నాటి శిబిరంలో దాదాపు వంద మందికిపైగా వివిధ పరీక్షలు చేయించుకుని వైద్యసలహాలు తీసుకున్నారు. ఈ శిబిరంలో బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలతో పాటు దంతపరీక్షలు, బాడీ వెల్నెస్ క్యాంపు కూడా నిర్వహించారు. ఆదివారం కూడా ఈ వైద్యశిబిరం కొనసాగుతుందని కాలనీ సొసైటీ ప్రతినిధులు రమేష్‌బాబు, రాజశ్రీ రామారావు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, విజయలక్ష్మి, భగత్, అస్పత్రి మేనేజర్ నాగరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.



డ్రగ్స్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు రవికిరణ్ తదితరులు

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి రవికిరణ్

వనస్థలిపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పీ. రవికిరణ్ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిస్తూ రవికిరణ్ ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్ డివిజన్ రాజప్పనగర్ నుంచి వనస్థలిపురం గణేష్ ఆలయం వరకు యువత పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ సమాజంలో నేడు జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, అసాంఘిక కార్యక్రమాలకు డ్రగ్స్‌కు అలవాటు పడిన వారే ప్రధాన కారణం అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం, డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలని కోరారు. అనంతరం డ్రగ్స్ మహమ్మారి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ గ్రామాల్లో బోనాలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్, తట్టిఅన్నారం, పెద్దఅంబర్‌పేట్ గ్రామాల్లో ప్రజలు ఆదివారం బోనాల పండుగను జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలైన ఈదమ్మ, పోచమ్మ, మైసమ్మ అమ్మవార్ల ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. బోనాలు సమర్పించేందుకు ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా పురుషోత్తం

హయత్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ఇంజాపూర్‌కు చెందిన కొండ్రు పురుషోత్తం నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామక పత్రాన్ని పురుషోత్తంకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

● ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్ పారిజాతారెడ్డి
● గుర్రంగూడ, కర్మన్‌ఘాట్‌లో పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠ

సరూర్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతలైన పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ తదితర అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మహేశ్వరం ఎమ్మెల్యే పీ. సబితాఇంద్రారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఆకాంక్షించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడ ఆదిత్యానగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీశక్తి పోచమ్మ ఆలయంలో శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సబితారెడ్డి, పారిజాతారెడ్డి ఈ కార్యక్రమంలో వేర్వేరుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా గ్రామ దేవతలను కొలవడం ఆచారంగా వస్తున్నదని, ఇది మంచి సంప్రదాయమని అన్నారు. ఇలాంటి ఆచార వ్యవహారాలు ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంచడంతో పాటు వారిలో ఐక్యతను చాటుతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టగల్ల రవీందర్, ఎస్.శ్రీనివాస్‌గౌడ్, గుర్రం సాయికిరణ్‌రెడ్డి, జక్కిడి విష్ణువర్ధన్‌రెడ్డి, గడ్డం లింగారెడ్డి, రాఘవేందర్‌గౌడ్, ఐలమ్మ, ఇతర ప్రతినిధులు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


గుర్రంగూడలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే సబితారెడ్డి


కర్మన్‌ఘాట్‌లో నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠలో మేయర్ పారిజాతారెడ్డి

కర్మన్‌ఘాట్‌లో..

సంతోష్‌నగర్ : కర్మన్‌ఘాట్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమం శనివారం మైసూర్ అవధూత దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు కొడకండ్ల రామచరణ్ శర్మ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలకు బండంగ్‌పేట మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్, బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి ఉమామహేశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు చేగోని మల్లేశ్‌గౌడ్, విఠల్‌గౌడ్, శివగౌడ్, చందు యాదవ్, హనుమాన్ ఆలయ ధర్మకర్త చీర తిరుమలేష్ పాల్గొన్నారు.

గోమాత సంరక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిది

● కశ్మీర్ నుంచి కన్యాకుమారికి గోసేవకుల పాదయాత్ర
● అఖిల భారత ఆర్ఎస్ఎస్ గోసేవా విభాగ్ అధ్యక్షుడు అజిత్‌జీ మహాపాత్ర

సైదాబాద్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతికి వారసత్వానికి ప్రతి రూపమైన గోమాతను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అఖిల భారత ఆర్ఎస్ఎస్ గోసేవా విభాగ్ అధ్యక్షుడు అజిత్ జీ మహాపాత్ర తెలిపారు. సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీలోని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పుంగనూర్ ఆవులకు పూజలు నిర్వహించి మహిళల సామూహిక వరలక్ష్మి వ్రతాలలో పాల్గొని గోవుకు తల్లి స్థానం ఉందని అందుకే హిందూ సనాతన ధర్మంలో గోమాతగా కొనియాడారని అన్నారు. దేశంలోని గోవులను సంరక్షిస్తామని ప్రతి ఒక్కరూ ప్రమాణం చేయాలని విజ్ఞప్తి చేశారు. నానాటికి తరిగిపోతున్న గోవుల కారణంగా ఏర్పడుతున్న కరువు కాటకాల నేపథ్యంలో గోసంరక్షణ ప్రస్తుత కాలంలో తప్పనిసరి బాధ్యతగా మారిందని చెప్పారు. ఊరూర గోవుల మహాత్యాన్ని ప్రచారం చేయాలని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 27 నుంచి మార్చి వరకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆరు రాష్ట్రాల మీదుగా సుమారు 4,500 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ఆర్ఎస్ఎస్ గోసేవా విభాగ్ ఉపాధ్యక్షుడు నావల్ కిషోర్, అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి, ప్రతినిధులు శ్రీనాథ్, తెలంగాణ గుజరాతి సంఘం అధ్యక్షుడు జిగ్నేష్ దోషి, ధర్మజాగరణ ప్రతినిధులు విజయ్, లోకేష్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, మురళీకృష్ణ, గుడాల రవి, మాణిక్‌యాదవ్ పాల్గొన్నారు.


గోపూజ చేస్తున్న అజిత్ జీ మహాపాత్ర

రహదారిని ఆనుకుని ఉన్న దుకాణాలను తొలగించాలి

వనస్థలిపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దుకాణాలను తక్షణమే తొలగించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ డివిజన్ చింతలకుంట, అండర్‌పాస్, సరస్వతినగర్ వెళ్లే విజయవాడ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దర్గా పేరు చెప్పుకుని దుకాణాలు పెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీన్ని నిరసిస్తూ కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి శనివారం జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విజయవాడ జాతీయ రహదారిపై దర్గా పేరు చెప్పుకుని అక్రమంగా ఏర్పాటు చేసిన షాపుల మూలంగా ట్రాఫిక్ ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ నుంచి సుమారు 25 కాలనీలకు వెళ్లే మూలమలుపు కావడంతో షాపుల మూలంగా కాలనీవాసులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాదాలకు నిలయమైన షాపులను తక్షణమే తొలగించి కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు ధర్మారావు, మురళీగౌడ్, సతీష్‌కుమార్, సత్యప్రియ, వెంకటరమణ, ప్రవీణ్, వెంకటేష్, జగన్ పాల్గొన్నారు.


నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్ నర్సింహారెడ్డి, కాలనీవాసులు

వంశరాజుల సంఘం భవనాన్ని కూల్చిన వారిపై ఫిర్యాదు

హయత్‌నగర్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఏపీనగర్ పేజ్-1లో అప్పటి గ్రామ పంచాయతీ ఇచ్చిన స్థలంలో తాము నిర్మించుకున్న వంశరాజుల సంఘం భవనాన్ని కూల్చి వేశారని వంశరాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. స్థానిక వంశరాజ్ సంఘం కోరిక మేరకు 2018లో అప్పటి తుర్కయంజాల్ సర్పంచ్ 200 గజాల స్థలాన్ని ఏపీనగర్ పేజ్-1లో కేటాయించారని తెలిపారు. అప్పట్లోనే గ్రామ పంచాయతీ అనుమతి తీసుకుని భవనాన్ని నిర్మించుకున్నామని తెలిపారు. ఇటీవల గ్రామానికి చెందిన కొందరు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భవనాన్ని కూల్చి వేశారని అన్నారు. ఈ విషయాన్ని పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. తమ సంఘానికి కేటాయించిన స్థలంలో తిరిగి భవనం నిర్మించుకునేందుకు సహకరించాలని వారు ఎమ్మెల్యేని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండు, సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్, యువ అధ్యక్షుడు యువరాజ్, యాదగిరి, కృష్ణయ్య, గోపాల్, తిరుపతయ్య, కృష్ణ, యాదగిరి, బండారు పరమేష్, యాదయ్య, భిక్షపతి, మల్లేష్, పోచయ్య, చంద్రయ్య, రమేష్, బాలయ్య తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.


ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసిన వంశరాజుల సంఘం రాష్ట్ర నాయకులు

చైన్ సిస్టం స్కీంలో చేర్పించి మోసం

● నలుగురిపై చీటింగ్ కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 10: చైన్‌సిస్టం స్కీంలో చేర్పించి మోసం చేసిన నలుగురిపై కేసునమోదు చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన సైనోజు మనోరమ అనే మహిళ స్పాట్ లోన్ క్లౌడ్ టెక్నిక్ కంపెనీలో చేరి పీఆర్ఎం ప్రసాద్ ద్వారా రూ. 1,600లకు ఐడీ తీసుకుంది. మరో ఇద్దరిని చేర్పిస్తే లాభాలు వస్తాయని కంపెనీ నిబంధనల ప్రకారం రూ. 3,200 చెల్లించి మరో ఇద్దరిని సంస్థలో చేర్పించింది. వీరిద్దరు మరో నలుగురిని చేర్పించి, మొత్తం ఏడుగురు సభ్యులతో రూ. 12,000 చెల్లించగా ఎలాంటి లాభం రాలేదు. దీంతో సంస్థల ప్రతినిధులను సంప్రదించగా ముఖం చాటేశారు. డబ్బులు కట్టినవారు వేధింపులకు దిగడంతో మానసిక వేదనకు గురైన మనోరమ కంపెనీ ఎండీ కాకుమను క్రాంతికుమార్, ప్రతినిధులు కొండవీటి సాయిప్రశాంత్, నర్రిశెట్టి పావనిలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూమ్ యాప్ ద్వారా కంపెనీలో చేర్పించి ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దేశవ్యాప్తంగా పదిలక్షల మందిని స్పాట్ లోన్ క్లౌడ్ టెక్నిక్ కంపెనీ వారు డబ్బులు కట్టించుకొని మోసం చేశారని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


మాట్లాడుతున్న భావన శ్రీనివాస్

తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించొద్దు

● జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షుడు భావన శ్రీనివాస్

వనస్థలిపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించవద్దని జాగృతి అభ్యుదయ సంఘం అధ్యక్షుడు భావన శ్రీనివాస్ కోరారు. శనివారం జాగృతి అభ్యుదయ సంఘం, ఆల్ ఈజ్ వెల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న భావన శ్రీనివాస్, ఎస్.జె.ఎస్ నందకిషోర్‌లు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన తెలుగు వారికి ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రం పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే అన్నారు. తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడమంటే తెలుగు భాషను, తెలుగు వారందరిని కించపర్చినట్లే అన్నారు. తెలుగు యూనివర్సిటీకి పేరు మార్పు ఆలోచనను సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే విరమించుకుని, తెలుగు ప్రజల అభిమానాన్ని పొందాలని హితవు పలికారు. కార్యక్రమంలో సైబర్‌క్రైమ్ వారియర్స్ పోతిరెడ్డి మాధవరెడ్డి, వనస్థలిపురం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు విట్టా దూరయ్య, డాక్టర్ రవికుమార్, నవీన్‌గుప్తా, సతీష్, వరప్రసాద్, వెంకటేశం, నాగలక్ష్మి, సువిధ పాల్గొన్నారు.

ఐటీఐల్లో అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులు

● మేడ్చల్, శామీర్‌పేట, అల్వాల్ ఐటీఐల్లో ఏర్పాటు

మేడ్చల్ ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మూడు ఐటీఐల్లో టాటా కంపెని సహకారంతో అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఆయా ఐటీఐల్లోని ప్రాంగణాల్లో ఇప్పటికే నూతన భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం నుండే అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు(ఏ.టీ.సి) ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం టాటా కంపెనితో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఒప్పందం చేసుకుంది. అందులో భాగంగా జిల్లాలో మేడ్చల్, శామీర్‌పేట, అల్వాల్ ఐటిఐలల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ మూడు ఐటీఐ ప్రాంగణాల్లో కొత్త అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుకు స్థల కేటాయింపు కూడా జిల్లా యంత్రాంగం పూర్తిచేయడంతో నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి.

6 కొత్త కోర్సులు

ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటుతో విద్యార్థులకు కొత్తగా 6 అడ్వాన్స్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్, ఆర్టీసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్(మెకానికల్), అడ్వాన్స్ సి.ఎన్.సి మ్యాచింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ కోర్సులున్నాయి.

ఒక్కో ఏ.టీ.సీకి 4.77 కోట్లు కేటాయింపు

ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటులో భాగంగా టాటా కంపెనీ ఒక్కో సెంటర్‌కు రూ. 4.77 కోట్లు కేటాయించనున్నట్లు తెలిసింది. దీనితో మూడు సెంటర్లకు కలిపి రూ.14.31 కోట్లు వ్యయం చేయనుంది. రెండేళ్ల పాటు టాటా కంపెనీ ఏ.టీ.సీ భవనాలు, టూల్స్ మెషినరీ, ఫ్యాకల్టీని సమకూర్చనుంది. రెండేళ్ల తర్వాత వీటిని ప్రభుత్వమే నిర్వహించనుంది.

జిల్లాలో ఏటా 488 మంది విద్యార్థులకు శిక్షణ

రోబోటిక్స్, డిజిటల్, ఎలక్ట్రిక్, ఆటోమేషన్ రంగాల్లో అడ్వాన్స్ శిక్షణ ఇప్పించి తమ సంస్థలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో టాటా కంపె నీ, రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఈ కొత్త ఏ.టీ.సీలను ఏర్పాటు చేస్తున్నవి. వీటి ద్వారా ప్రతి ఏటా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 488మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కే.వీ.రమణాచారి తదితరులు

శాస్త్రీయ, సంగీత నృత్యాలపై మరింతగా పరిశోధన జరగాలి : కే.వీ. రమణాచారి

తార్నాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంగీతంలో భాగమైన శాస్త్రీయ, సంగీత నృత్యాలపై మరింతగా పరిశోధన జరగాలని తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు డాక్టర్ కే.వీ.రమణాచారి అన్నారు. నవ్య నాటక సమితి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఓయూలోని ఆంధ్ర మహిళా సభలో రెండు రోజుల జాతీయ సదస్సును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కే.వీ.రమణాచారి మాట్లాడుతూ.. మన లలిత కళల ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత నృత్య, సంగీత గురువులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సంచాలకురాలు జి.వసుంధర, నవ్య నాటక సమితి అధ్యక్షుడు వి.విజయ్‌కుమార్, నృత్య గురువులు పి.వి.రమణ, స్నేహ, రామచందర్, మధుమతి కులకర్ణి, రేణుక, ప్రభాకర్ పాల్గొన్నారు.